## క్లుప్తంగా

### మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు



శ్రీశైలంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సింగర్ మనోలతో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, సింగర్ మనో వేరువేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాస రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

### ఎంఈఓ-2పై చర్యలు తీసుకోవాలి

**నందికొట్కూరు:** విధులకు దుమ్మా కొట్టిన మండల విద్యాశాఖ-2 శ్రీనివాసులుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు నాగార్జున, డక్క కుమారి, నాగరాజు శనివారం కుర్చీకి వినతి పత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. పుస్తకాల వ్యాపారానికి సిద్ధమవుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోని అధికారులపై జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. టీచర్లతో ప్రచారం చేయిస్తున్న స్కూళ్లపై చర్యలు చేపట్టాలన్నారు.

### మద్యం విక్రయిస్తే చర్యలు

**కొత్తపల్లి:** గ్రామాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జయశేఖర్ హెచ్చరించారు. శనివారం ఎర్రమఠం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి ఇంటి వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### సాముహిక అక్షరాభ్యాసాలు



అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

**కొత్తపల్లి:** పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి క్షేత్రంలో సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. శనివారం అమ్మవారికి ఉదయం పంచసూక్తములతో అభిషేకం, మంగళ హారతి కార్యక్రమాలు ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు బీజాక్షరాలు రాయించి సాముహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

### నిత్యం తృప్తిని కలిగించేది భక్తిమార్గం

**నందికొట్కూరు:** నిత్యం తృప్తిని కలిగించేది భక్తిమార్గమని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శనివారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో ఐదు రోజుల ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి. గ్రామంలోని పురవీధుల వెంట గోమాతను ఊరేగించారు. పురోహితులు జంధ్యాల వీరప్రసాద్ శర్మ చేత సామూహిక కుంకుమార్చనలు, గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

### ఆరోపణలు అవాస్తవం

**ఆత్మకూరు:** పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇటీవల అక్రమాలు జరిగాయని ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ గురుప్రసాద్ ఆరోపణలు చేయడం సరికాదని ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్‌లు అన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమపై కార్యదర్శి చేసిన ఆరోపణ అవాస్తవమన్నారు. ఆత్మకూరు మహిళా మండలి అధ్యక్షురాలి ఎంపికలో కూడా నిబంధనల ప్రకారమే జరిగిందన్నారు. తమపై ఆరోపణలు చేసిన వ్యక్తిని సంఘం నుంచి తొలగించామన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు వెంకటగణేష్, మారం విజయ్‌కుమార్, సేగు వేణు, గుంత నాగపని, ఈపూరు శ్రీను,ఇస్కల కృష్ణ, సాయి పాల్గొన్నారు.

### పండగను శాంతియుతంగా జరుపుకోవాలి

**వెలుగోడు:** మండలంలో బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ ముస్లింలకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం ఎస్ఐ మాట్లాడారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు మండ్ల శంకర రెడ్డి, గోవింద్, నసరుల్లాఖాన్, అమీర్జంజ, హీదాయత్, ఖలీల్ పాల్గొన్నారు.

### సలహాలు పాటించాలి

**ఆత్మకూరు:** వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్త సుధాకర్ రైతులకు సూచించారు. నల్లకాలువ, వడ్ల రామాపురం, సిద్ధపల్లె గ్రామాల్లో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లె ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ముందస్తు వర్షించి.. రైతన్నను ఊరించి!

ముందస్తు వర్షాలు ఊరిస్తుండటంతో రైతన్నలు పొలాల బాటా పట్టారు. అన్నదాతల ఆశల విత్తు, సేద్యపు సాగుతో పొలాలు సందడి చేస్తున్నాయి. వ్యర్థాల ఏరివేత.. ఎరువు చల్లడం.. దుక్కిదున్నడం పనుల్లో నిమగ్నమైన కూలీలతో నేలమ్మ కళకళలాడుతోంది. కొందరు రైతులు ఇప్పటికే విత్తు పనులనూ సైతం మొదలు పెట్టేశారు. కాగా వాన దేవుడు కరుణించినా.. కూటమి ప్రభుత్వం సహకారమే రైతులకు ఏమాత్రం అందడం లేదు.

- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ఆశాజనకంగా వర్షాలు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు
- ప్రభుత్వం నుంచి కొరవడిన సహకారం



కొత్తపల్లి: పొలంలో ఎరువు వదిలిన దృశ్యం



బండిఆత్మకూరు: ఖరీఫ్ సాగుకు దుక్కి దున్నుతున్న రైతు



కొత్తపల్లి: బావాపురం పొలంలో కాడెద్దులతో సేద్యం చేస్తున్న రైతన్న

**నందికొట్కూరు/కొత్తపల్లి/బండిఆత్మకూరు:** మే రెండో వారం నుంచే నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో ఖరీఫ్‌లో మొక్కజొన్న 25,921, వరి 13,487, మినుము 6,054, పత్తి 1,404, కంది 4,301 హెక్టార్లలో సాగువుతుంది. శ్రీశైలం నియోజకవర్గంలో 85,850 ఎకరాలు సాగు కానుంది. ఇందులో ఆత్మకూరు మండలంలో 22,250 ఎకరాలు, బండిఆత్మకూరు మండలంలో 33 వేలు, వెలుగోడులో 14వేలు, మహానందిలో 16,600 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో రైతన్నలు ఎంతో ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పొలాలకు ఎరువులను తోలుకుని, వాటిని చిమ్ముకునే పనిలో ఉన్నారు.

#### కూటమి ప్రభుత్వం చర్యలు శూన్యం

ముందస్తు వర్షాలతో రైతన్నలు సాగుకు సిద్ధమవుతుండగా కూటమి ప్రభుత్వం మాత్రం ఏమాత్రం ఉలుకూ పలుకూ లేకుండా ఉంది. అన్నదాతలకు ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదు. దీంతో పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది.

#### నకిలీ విత్తనాలపై దృష్టి సారించాలి

అదును, పదును ఒకే సారి వచ్చినట్లయితే రైతులు విత్తనాల కోసం ఒక్కసారిగా ఎగబడే ప్రమాదం ఉంది. రైతుల హడావుడి చూసి విత్తనాల డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశం ఉంది. రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసుకోవాలి. విత్తనాలను కొనుగోలు చేసిన తరువాత తప్పని సరిగా బిల్లు, విత్తనాల సంచిని భద్రపరుచుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి.

– విజయశేఖర్, ఏడీఏ నందికొట్కూరు

#### విత్తనాలు ఇవ్వడం లేదు



ముందుస్తు వర్షాలు కురుస్తున్నాయి. మరోపక్క ఖరీఫ్ ముంచుకొస్తున్నా ఈ ప్రభుత్వం విత్తనాలు ఇవ్వడం లేదు.ఎన్నికల సమయంలోనేమో చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఇస్తానని ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. మేమే అప్పు చేసి ప్రైవేట షాపుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుక్కుంటున్నాం. – మల్లేశ్వరరెడ్డి, చింతలపల్లి గ్రామం, మిడుతూరు మండలం

#### సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



15 ఎకరాల్లో సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నాను. వర్షాలు బాగా కురుస్తున్నాయి. కానీ ఎంత వరకు ప్రభుత్వం విత్తనాలు గానీ, ఎరువులు గానీ ఇవ్వలేదు. బయటి షాపుల్లో కొనాలంటే ధరలు విపరీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి.

– రామసుబ్బారెడ్డి, రైతు, సింగరాజుపల్లె



నందికొట్కూరు: పొలంలో చెత్తా చెదారం తగల బెడుతున్న కూలీలు

## నాసిరకం పనులపై సీఎం దృష్టికి తీసుకెళ్తా

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**నందికొట్కూరు:** నాసిరకంగా నేషనల్ హైవే నిర్మాణం పనులు చేపడితే చూస్తూ ఊరుకునేది లేదని రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. నిబంధలు పాటించకుండా రోడ్డు వేయడంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న నేషనల్ హైవే నిర్మాణ పనులను మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం మట్టి వాడి నేషనల్ హైవే రోడ్డు వేసిన కాంట్రాక్టర్ ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు. కాంట్రాక్టర్‌పై సెంట్రల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ చేయిస్తామన్నారు. నాణ్యత లేని రహదారులు వేసి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆర్ అండ్ బీకి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇదే కాంట్రాక్టర్ గతంలో నాసిరకంగా రోడ్లు వేయడంతో విజిలెన్స్ విచారణ రిపోర్టుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వాహనాదారులు కట్టిన పన్నుతోనే రోడ్లు వేస్తున్నామని గుర్తు చేశారు. ఎవరి దయాదాక్షిణ్యాలతో రోడ్డు వేయడం లేదన్నారు. అగ్రిమెంట్ ప్రకారం నేషనల్ హైవే రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యే జయసూర్య, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

## సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ

**శ్రీశైలంటెంపుల్:** జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శనివారం శ్రీశైలం పరిధిలోని మేకలబండ చెంచుకాలనీలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. చెంచు గూడెంలో నెలకొన్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం సెలవు రోజు కాబట్టి ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివప్రసాద్ ఉన్నారు.

- **పాములపాడు:** మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు 90 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని చెలిమిళ్ల గ్రామంలో సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డితో కలిసి పింఛన్లు పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5,657 పింఛన్లకు గాను 5,042 పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసినట్లు చెప్పారు.
- **పగిడ్యాల:** మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన తూర్పు ప్రాతకోట, లక్ష్మాపురం గ్రామాలకు చెందిన కుమ్మరి రాముడుకు రూ.25 వేలు, అంగన్‌వాడీ టీచర్ సరాల పద్మావతికి రూ.60వేల చెక్‌లు అందజేశారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమిత్రమ్మ ఉన్నారు.
- **జూపాడుబంగ్లా:** మండలంలో శనివారం లబ్ధిదారులకు అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం సమయానికి 4,497 పింఛన్లు పంపిణీ చేసి 92 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు.

## యోగాంధ్రలో భాగస్వాములుకండి

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

**శ్రీశైలంటెంపుల్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. శనివారం శ్రీశైలంలోని గంగాధర మండపం నుంచి నంది సర్కిల్ వరకు 1,500 మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, జేసీ సి.విష్ణుచరణ్, దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులుతోపాటు అధికారులు, శివసేవకులు, స్థానిక చెంచులు పాల్గొన్నారు. వీరితో యోగా గురువు గంధవళ్ల బాల సుబ్రహ్మణ్యం యోగాసనాలు వేయించారు. అనంతరం కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక ప్రదేశాల్లో యోగ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. అందులో భాగంగా మొదటిగా శ్రీశైలంలో, జూన్7న మహానంది, 13న బెలుంగుహలు, 18న అహోబిలం, 20న పచ్చర్ల జంగిల్ క్యాంప్‌లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలలో యోగ శిక్షకులను తయారు చేసి జిల్లా వ్యాప్తంగా 8లక్షల మందికి యోగ నేర్పించి, అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధం చేస్తామన్నారు.



యోగాసనం వేస్తున్న కలెక్టర్

- **బండి ఆత్మకూరు:** మండల కేంద్రంలోని జనార్దన స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఆయుష్ డాక్టర్ వి.నాగరాజు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సునీత, భావనా రెడ్డి పాల్గొన్నారు.
- **పాములపాడు:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్ హాల్‌లో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు. ఈ మాస్టర్ ట్రైనర్స్ శివప్రసాద్, మల్లీశ్వరి యోగాసనాలు వేయించారు. ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వర్ రెడ్డి, ఏఓ గాయత్రి పాల్గొన్నారు .

## తప్పుడు తూకాలతో మోసం చేస్తే చర్యలు తప్పవు

**జూపాడుబంగ్లా:** తప్పుడు తూకాలతో మోసం చేస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ హనుమాన్‌సింగ్, టెక్నీషియన్ రాజు డీలర్లను హెచ్చరించారు. శనివారం వారు మండలంలోని డీలర్ల వద్ద ఉన్న తూనికల యంత్రాలను, ఈ పాస్ మిషన్లను పరిశీలించి, వివరాలను ఈపౌరసరఫరాల శాఖ యాప్‌తో అనుసంధానం చేశారు.

- నేటి నుంచి ఎలాంటి అక్రమాలకు తావులేకుండా కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ డీలర్లకు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రతి నెల 15వ తేదీ వరకు రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్‌షాపులు తెరిచి ఉంచి కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు.



కాటాను పరిశీలిస్తున్న దృశ్యం

## వెన్నుపోటు దినం ర్యాలీకి తరలిరండి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

**ఆత్మకూరు/వెలుగోడు:** జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం ర్యాలీకి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. శనివారం ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లోని పార్టీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఆయా సమావేశాల్లో శిల్పా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ నెల 4వ తేదీకి ఏడాది పూర్తవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం పేరుతో ఆత్మకూరు పట్టణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పనితీరుపై, ప్రజలకు ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాలపై పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇటీవల పదవులు పొందిన కమిటీ సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆత్మకూరు సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, మోమిన్‌అహ్మద్‌హుసేన్, వెంకటస్వామిగౌడ్, సోమశేఖర్, విజయ్‌చౌదరి, నాగరాజు, రమేష్, పొందూరి శివారెడ్డి, మోమిన్, మున్నీర్‌బాషా, దర్గమ్మ, షఫీవున్, కనిముల్లా, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, రఫిక్, ప్రభుదాస్, శివశంకర్‌నాయక్, వెంకటేశ్వరనాయక్, నాగేశ్వరరెడ్డి, ప్రతాప్, ధనుంజయ, కొత్త రామాపురం రామచంద్రుడు, రాజు, వెలుగోడు సమావేశంలో మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, నాయకులు దేశం తిరుపం రెడ్డి, వంగాల నాగేశ్వర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ నెంబర్ ఇలియాస్ ఖాన్, బోగోలు శివ శంకర్ నాయుడు, సుదర్శనం, కాసారపు రామ్మోహన్ రెడ్డి, శంషీర్ అలీ, ఏసురత్నం, మొహమ్మద్ ఇక్బాల్, షాషా ఖాద్రి,ఎంజబీబుల్లా, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు

#### శిల్పాకు సన్మానం

**ఆత్మకూరు:** వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు మున్సిపాలిటీ రైతు విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన బైరాపురం రహంతుల్లా ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని నాయకులు మోమిన్, మున్నీర్‌బాషా, మహబూబ్‌బాషా, ఇబ్రహీం, ముర్తుజా, ధనుంజయుడు, వెంకటేష్‌నాయక్, రవీంద్రయాదవ్ తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీపతిరావుపేట గ్రామంలోని రబ్బాని కుమారుడి వివాహ వేడుకకు శిల్పా హాజరయ్యారు.

#### పరామర్శ

మండలంలోని ముష్టపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయక్ అనారోగ్యంతో గుండెకు స్టంట్ వేయించుకున్నారు. విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణిరెడ్డి రవి స్వగృహానికి వెళ్లి పరామర్శించాడు.

### చిరుధాన్యాలు సాగు చేయాలి

**మహానంది:** చిరుధాన్యాలు సాగు చేయాలని యాగంటిపల్లె కేవీకే శాస్త్రవేత్త బాలరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ రైతులకు సూచించారు. తిమ్మాపురం సచివాలయంలో శనివారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. రాబోయే రోజుల్లో చిరుధాన్యాల వినియోగం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐఎంఆర్ శాస్త్రవేత్త శ్రీనివాస్, మహానంది వెంకటేశ్వర పరిశోధన స్థానం హెడ్ సైంటిస్ట్ ధర్మారావు, ఏఓ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

**నందికొట్కూరు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించే ప్రసక్తే లేదని వామపక్ష పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్ హెచ్చరించారు. శనివారం మిడుతూరు మండలం పీర్ సాహెబ్‌పేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలతో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు ఏడు వారాల నుంచి వేతనాలు ఇవ్వకపోతే ఎలా జీవనం గడుపుతారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు శ్రీనివాసులు, మద్రిస్వామి, స్వామన్న, ఉపాధి కూలీలు మల్లేశ్వరమ్మ, పాపులమ్మ, వెంకటలక్ష్మమ్మ, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

## రైతుల కష్టం ‘కృష్ణా’ర్పణం

కొత్తపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల శివారులో రైతులు శ్రీశైలం వెనుకజలాలు తగ్గినప్పుడు నీటి ముంపు భూముల్లో రబీ సీజన్‌లో రైతులు ఎక్కువగా నువ్వుల పంట సాగుచేసుకుంటారు. ఈ సారి మేలో అధిక వర్షాలు పడడంతో వేసిన పంటలు కాస్తా కృష్ణానది పాలయ్యాయి. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. శ్రీశైలం వెనుక జలాలు సంగమేశ్వరం సమీపం ప్రాంతాల వెంట క్రమేపీ నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. ఈక్రమంలో రైతన్నలు వందల ఎకరాల్లో వేసిన నువ్వుల పంటలు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో మునిగిపోతున్నాయి. చేతికొచ్చిన సమయంలో పంట నీట మునగడంతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. – కొత్తపల్లి



కృష్ణాజలాల్లో మునిగిపోతున్న నువ్వుల పంట

### ఆసుపత్రి భవనాలకు మరమ్మతులు

**శ్రీశైలంప్రాజెక్ట్:** సున్నిపెంట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాలకు త్వరలో మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఇన్, ఔట్ పేషెంట్లకు అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత, నిరుపయోగంగా ఉన్న నూతన భవనాల గురించి సిబ్బంది మంత్రికి వివరించారు. ఖాళీగా ఉన్న వైద్య, సిబ్బంది పోస్టులను త్వరలోనే నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా, డాక్టర్లు సోహైల్, సంగీత, హెడ్ నర్స్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతన్న మంత్రి సత్యకుమార్